సాక్షి చిత్తూరు

శనివారం । 4 । జనవరి । 2025



పరి'శ్రమ'కు తొలి అడుగు

పుంగనూరులో పరిశ్రమల స్థాపనకు పెద్దిరెడ్డి చేసిన కృషితో పారిశ్రామికవాడ ఏర్పాటుకు తొలి అడుగుపడింది. - IIలో



81 మంది మహిళలకు అర్హత

కానిస్టేబుల్ పోస్టుల భర్తీలకు నిర్వహించిన దేహ దారుఢ్య పరీక్షల్లో 81 మంది మహిళలు రాత పరీక్షకు అర్హత సాధించారు. - IIలో



నాసిరకంగా మధ్యాహ్న భోజనం

మధ్యాహ్నభోజనం నాసిరకంగా ఉందని పీసీ చైర్మన్లు విద్యాశాఖ పరిశీలకుడు పెంచలయ్య దృష్టికి తీసుకొచ్చారు. - IIలో



గుంతలు పడిన చిత్తూరు-తిరుత్తణి రోడ్డు



పైపై పూత..

నిధుల మేత

మరమ్మతులు చేసినట్లుండాలి.. కానీ చేయకూడదు.. తారు కలిపామా? లేదా అన్నట్లుండాలి. పైపై పూత పూయాలి కానీ నాణ్యతగా మరమ్మతులు చేయకూడదు. బిల్లు మంజూరు అయ్యే వరకు ఉంటే చాలు.. ఇదీ కూటమి నేతలు, కాంట్రాక్టర్ల వ్యూహం. నాగరితకు చిహ్నం అయిన రహదారుల మరమ్మతుల్లో నాణ్యత నలిగిపోగా.. కూటమి నేతలు, కాంట్రాక్టర్ల అవినీతి, అధికారుల నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఓ వైపు రోడ్లపై గుంతలు పూడ్చుతుండగా మరో వైపు మళ్లీ గుంతలు పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

- నాసి రకం రోడ్ల పనులు చేసి, రూ.కోట్లలో బిల్లులు స్వాహా
- గుంతలు పూడ్చుతున్నామంటూ కూటమి ప్రభుత్వం ఆర్భాటం
- జిల్లాలో 280కి పైగా రోడ్లలో అలాగే దర్శనమిస్తున్న గుంతలు
- దుమ్మెత్తి పోస్తున్న జిల్లా ప్రజలు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్బీ రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో రోడ్లు మరమ్మతులు చేపట్టారు. ఆ పనుల్లో నాణ్యత లేకపోవడంతో మరమ్మతులు చేసిన రెండు రోజులకే మళ్లీ అధ్వానంగా మారాయి. దీంతో వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. జిల్లాలోని చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి, పూతలపట్టు, పుంగనూరు నియోజకవర్గాల్లోని ఆర్అండ్బీ రోడ్లు మరమ్మతు చేసిన రెండు రోజులకే మళ్లీ గుంతలు పడ్డాయి. దీంతో ఆర్అండ్బీ పరిధిలో 280 పైగా రోడ్లల్లో గుంతలు అలాగే దర్శనమిస్తున్నాయి.

సంక్రాంతిలోపు మరమ్మతులు పూర్తి ప్రశ్నార్థకమే

జిల్లాలో బీటీ రోడ్ల మరమ్మతులు, గుంతలు పూడ్చే కసరత్తు సంక్రాంతిలోపు పూర్తయ్యే అవకాశాలు ఏ మాత్రం కనిపించడం లేదు. జిల్లాలో 280 రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు ప్రభుత్వం రూ.21.53 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 1500 కిలోమీటర్లు పొడవున ఉన్న ఈ రోడ్ల మరమ్మతుల కాంట్రాక్టులను అధికార పార్టీ నేతలు సిఫార్సులు ఉన్నవారికే కట్టబెట్టారు. అయితే వీటిని సంక్రాంతికి పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. కానీ ఇప్పటి దాదాపు 50 శాతం పనులు సైతం పూర్తి కాని పరిస్థితి. అంటే 130 రోడ్లలో పనులు 700 కిలోమీటర్లు మాత్రం పూడ్చారు. అవి కూడా నాసిరకంగానే పనులు చేపట్టడంతో కొన్నాళ్లకే మళ్లీ గుంతలుగా దర్శనమిస్తున్నాయి. మిగిలిన రోడ్ల పనులను సంక్రాంతిలోపు పూర్తి చేయాలని పెట్టుకున్న లక్ష్యం నెరవేరడం అనుమానంగానే ఉందని ఆర్అండ్బీ శాఖ అధికారులే పేర్కొంటున్నారు. ఇందులో నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే కుప్పం 437 కిలోమీటర్లు, పూతలపట్టు 95 కి.మీ, పలమనేరు 105, పుంగనూరు 40, చిత్తూరు, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాలు కలిపి 20 కిలోమీటర్లు చొప్పున మొత్తం 700 కిలోమీటర్లు మాత్రమే రోడ్డు వేశారు. మిగిలిన రోడ్లన్నీ అలాగే ఉన్నాయి.



వీఎస్ అగ్రహారం చెరువుకట్ట నుంచి దివిటివారిపల్లె వరకు చేసిన రోడ్డు మరమ్మతులు



ప్యాచ్ వేసిన కొద్దిరోజులకే గుంతలుపడిన చిత్తూరులోని ఎస్టేట్ రోడ్డు

నియోజకవర్గం	రోడ్ల సంఖ్య	నిధులు రూ.కోట్లలో
చిత్తూరు	13	2.86
పూతలపట్టు	46	3.18
జీడీనెల్లూరు	37	4.08
నగరి	22	2.88
పలమనేరు	43	2.05
పుంగనూరు	34	2.65
కుప్పం	85	3.83
మొత్తం	280	21.53



తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన ఐరాల మండలంలోని గోవిందరెడ్డిపల్లె - వినాయకపురం రోడ్డు



టేకుమంద-జయంతి రోడ్డులో గుంతలకు వేసిన ప్యాచ్‌లు

రోడ్లు వెంటనే బాగు చేయాలి



జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం కష్టంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆర్అండ్బీ రోడ్లలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడినా పూడ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం సరికాదు. ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వాటిని వెంటనే బాగు చేయాలి.

– గంగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి

వర్షాలతో ఆలస్యం



జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డు పనులు సకాలంలో జరగలేదు. నాలుగు సార్లు దశలవారీగా వర్షాలు కురవడంతో దాదాపు నెల రోజుల వరకు పనులు జరగలేదు. గుంతలతో నిండిన 280 రోడ్ల మరమ్మతు పనులు చేపట్టేందుకు రూ.21.58 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతానికి 50 శాతం పనులు పూర్తి చేశాం. మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తాం.

– శ్రీనివాసులు , ఈఈ ఆర్అండ్బీ



నలగాంపల్లె-కేబీఎన్ కండ్రిగ మార్గంలో దెబ్బతిన్న రోడ్డు

న్యూస్‌రీల్

సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు



సీఎం పర్యటన ప్రదేశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

కుప్పం: సీఎం చంద్రబాబు రెండురోజుల కుప్పం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి ఆయన పరిశీలించారు. ద్రవిడ వర్సిటీ కందుకూరి వీరేశలింగం ఆడిటోరియంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూఈ నెల 6, 7వ తేదీల్లో ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా సీఎం పర్యటన ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. తరువాత ద్రవిడ వర్సిటీ ప్రాంగణంలో హెలీప్యాడ్, అగరం కొత్తపల్లెలో ప్రజలతో ముఖాముఖి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడా పీడీ వికాస్ మరమ్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని మురకంబట్టులో ఉన్న ఎస్‌జీఎం కల్యాణ మండపంలో ఈ నెల 4 వ తేదీన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జాతీయ అంధుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. అంధులు మంచి విద్యనభ్యసించి జీవితంలో విజయాలను సాధించేందుకు వీలు కల్పించిన పద్ధతి బ్రెయిలీ లిపి అని అన్నారు. బ్రెయిలీ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ఏటా జనవరి 4 వ తేదీన ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న బ్రెయిలీ జయంతి దినోత్సవానికి ప్రతి ఒక్కరూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఢిల్లీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మూడు నెలల ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పన కోసం మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఈడీ హరినాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ ప్రైజెస్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో స్కిల్ డెవెలప్‌మెంట్ కోర్సుల్లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాలో ఈ శిక్షణను ఆసక్తి ఉన్న మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బౌద్ధులు, జొరాస్ట్రియన్) సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారు వృత్తి, విద్య, ఇతర విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్సులతో బయోడేటాను ఈ నెల 17వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని మైనారిటీ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

టీబీ పరీక్షలు విధిగా చేయాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నిరంతరంగా దగ్గు వస్తున్న వ్యక్తులకు విధిగా టీబీ పరీక్షలు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆమె శుక్రవారం ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వ్యక్తులకు టీబీ పరీక్షలు చేయాలన్నారు. అనుమానిత కేసులకు ఆశ కార్యకర్తలు గళ్ల పరీక్షలు చేసి, వివరాలు అందించేలా చూడాలన్నారు. పాజిటివ్ నిర్ధారణ అయినవారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీబీ నివారణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, అధికారులు అనిల్‌కుమార్, రామచంద్రారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశ చరిత్ర తిరగరాసిన

ఏకైక సీఎం జగన్

–మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కార్వేటినగరం: తెలుగుభాషతోపాటు పేదలకు ఆంగ్ల మాధ్యమం అందుబాటులోకి తీసుకొచ్చి దేశచరిత్రను తిరగరాసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు అందని ద్రాక్షలా ఉన్న ఆంగ్లమాధ్యమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి, బైజ్యూస్ కంటెంట్‌తోపాటు ట్యాబ్‌లను అందించిన ఘనత కూడా మాజీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలుగును నిర్వీర్యం చేశారని ప్రముఖులు విజయవాడలో జరిగిన తెలుగు మహాసభల్లో చెప్పడం దారుణమన్నారు. దళితులకు ఆంగ్లభాషను అందించడం నేరమన్నదే దానికి అర్థమన్నారు. విద్యావంతులు కూడా దళితులు, నిరుపేదల ఉన్నతిని జీర్ణించుకోలేక, కుల వివక్ష చూపుతున్నారని నారాయణస్వామి విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారని, అలాగే విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యను అందించారన్నారు. పేద విద్యార్థులకు మేనమామగా నిలిచారని, ఆ విషయాన్ని జీర్ణించుకోలేని టీడీపీ ప్రభుత్వం కార్పొరేటర్లకు దాసోహమై, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందని పేర్కొన్నారు. పలువురు ప్రముఖుల మనవళ్లు మాత్రం కార్పొరేట్ స్థాయిలో విద్యనభ్యసించాలి, బడుగు బలహీన వర్గాల పిల్లలు మాత్రం నాణ్యత లేని విద్యకే పరిమితం కావాలా..? అన్ని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యాబోధనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. రాక్షస పాలన సాగిస్తూ దళిత, పేదలకు ఉన్నత విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని స్పష్టం చేశారు.

పకడ్బందీగా ఎన్‌సీడీ సర్వే

చిత్తూరురూరల్(కాణిపాకం): ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వేను పకడ్బందీగా చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాయలంలో ఆమె శుక్రవారం అధికారులతో మాట్లాడారు. ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఇంటిని కచ్చితంగా సర్వే చేయాలన్నారు. 18 ఏళ్ల నిండిన వ్యక్తులను పరీక్షించాలన్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ సర్వేలో గుర్తించిన విషయాలను అధికారులకు వివరాలు అందేలా చూసుకోవాలన్నారు. బాధితులను గుర్తిసే తగిన సలహాలు అందించి, ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యసేవలు అందేలా చూడాలన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 62,085 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.17 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

కర్షకుడికి కన్నీరే

సీమ కరువుకు చిరునామా.. అలాంటి రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్న సదుద్దేశంతో హంద్రీనీవా ప్రాజెక్టు చేపట్టారు. అందులో భాగంగా చిత్తూరు జిల్లా పడమటి మండలాలకు సాగు, తాగు నీరందించాలని పుంగనూరు ఉపకాలువ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కెనాల్ విస్తరణ పనులు సైతం మొదలు పెట్టారు. అయితే కూటమి నికర జలాలు మిగిలితేనే ఉపకెనాల్‌కు నీరని మెలిక పెట్టింది. ఫలితంగా కర్షకుడికి క'న్నీరే' మిగలనుంది.

హంద్రీనీవా కాలువలో ఇక నీరు రానట్టే?

- నికర జలాలను ఏపీ, తెలంగాణలు వాడుకున్నాకే ఇక్కడికట!
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు తేల్చి చెప్పిన కూటమి సర్కార్
- నికరజలాలు పోతే మిగులు జలాలు కుప్పానికి రానట్టే
- అందుకే పీజీసీ, కేజీసీ కాలువ లైనింగ్ పనులకు ప్రాధాన్యం

పలమనేరు: జిల్లాలోని పడమటి ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం హంద్రీనీవా ప్రాజెక్టు చేపట్టింది. అయితే ఈ కాలువలో కృష్ణా జలాలు భవిష్యత్తులో రానట్టేనని తెలుస్తోంది. కృష్ణాజల వివాదాల ట్రిబ్యునల్-1 తీర్పు అమల్లో ఉన్నంత కాలం కృష్ణాలోని 811 టీఎంసీల నికరజలాలను ఏపీ, తెలంగాణాలు వాడుకుని, ఆపై మిగులు జలాలు మాత్రమే హంద్రీనీవా కాలువకు విడుదల చేస్తామని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కూటమి ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. దీన్ని బట్టి చూస్తే భవిష్యత్తులో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీనీవాకు నీరు వచ్చే అవకాశం లేదని తెలిసిపోయింది. ప్రధాన కాలువకే నీరు రాకుంటే ఇందులో అంతర్భాగమైన పుంగనూరు, కుప్పం ఉపకాలువలు అలంకార ప్రాయంగా మారడం ఖాయం.

నీరు రాకున్నా లైనింగ్ పనులకు పచ్చజెండా

హంద్రీ-నీవా సుజల స్రవంతి రెండో దశలో అంతర్భాగమైన పుంగనూరు బ్రాంచి కెనాల్ విస్తరణ కోసం గత ప్రభుత్వం రూ.1219.93 కోట్లతో చేపట్టిన పనులకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. అయితే పీబీసీ కాంక్రీట్ లైనింగ్ పనులకోసం రూ.480.22 కోట్లకు ప్రభుత్వ అనుమతులునిస్తూ జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఇప్పటికే ఉత్తర్వులను జారీ చేశారు. ఈ లైనింగ్ పనుల ద్వారా పీబీసీ ప్రవాహ సామర్థ్యాన్ని 145 నుంచి 282 క్యూసెక్కులకు పెంచే లక్ష్యంగా పేర్కొన్నారు. క్రిష్ణా ట్రిబునల్ ఆదేశాలు మిగులు జలాలు మాత్రమేనని స్పష్టం చేశాక కూడా నీరు రాని కాలువలో నీటి సామర్థ్యాన్ని ఎలా పెంచుతారో కూటమి ప్రభుత్వానికే తెలియాలి. ఇప్పటికే కుప్పం బ్రాంచి కెనాల్‌కు సైతం లైనింగ్ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.161.78 కోట్లతో టెండర్లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఇందంతా చూస్తే కాలువలో నీరు రాకున్నా పర్వాలేదు గానీ, లైనింగ్ పనులతో కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు సిద్ధమైందని అర్థమవుతోంది.



గత ప్రభుత్వంలో కుప్పానికి నీటినందిన దృశ్యం(ఫైల్)




పశుపత్తూరు వద్ద ముగిసే కుప్పం ఉపకాలువ

పుంగనూరు కాలువ స్వరూపమిదీ

హంద్రీనీవా ప్రధాన కాలువ కర్నూలు జిల్లా మల్యాల నుంచి ప్రారంభమై 554కి.మీ. ప్రయాణించి అన్నమయ్య జిల్లా కేవీపల్లి మండలంలోని అడవిపల్లి రిజర్వాయర్ వద్ద ముగుస్తుంది. ఈ ప్రధాన కాలువలోని 400 కి.మీ వద్ద అనంతపురం జిల్లాలో బొంతలపల్లి వద్ద ఉమ్మడి చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించడంతో పుంగనూరు ఉపకాలువ మొదలవుతుంది. అక్కడి నుంచి తంబళ్లపల్లి, మదనపల్లి, పుంగనూరు నియోజకవర్గాల మీదుగా పలమనేరు నియోజకవర్గంలోని గంగవరం మండలంలోని పశపత్తూరులో 224 కి.మీ. వద్ద ముగుస్తుంది. అక్కడి నుంచి కుప్పం ఉపకాలువ మొదలవుతుంది.

పూర్తిగా నిండిన చెర్లోపల్లి రిజర్వాయర్ నీరు వృథా

వర్షాల కారణంగా సత్యసాయి జిల్లాలోని చెర్లోపల్లి జలాశయం 1.5 టీఎంసీల నీటితో నిండుకుండను తలపిస్తోంది. ఇదే సమయంలో పుంగనూరు, పలమనేరు కుప్పం నియోజకవర్గాల్లో 90 శాతం చెరువులకు చుక్కనీరు లేదు. ఇప్పుడు చేస్తున్న లైనింగ్ పనులను కొంత సమయం ఆపి, జలాశయం నుంచి నీటిని పుంగనూరు ఉప కాలువ నుంచి కుప్పం ఉపకాలువకు కృష్ణా జలాల విడుదల చేసుంటే ఈ ప్రాంతాల్లోని చెరువులు నిండి పంటపొలాలకు సాగునీటి ఇబ్బందులు తప్పేవి. ఇక్కడి చెరువులు నిండాక లైనింగ్ పనులు చేపట్టినా ఇక్కడి రైతులకు వచ్చే నష్టమేమి లేకుండా ఉండేది. కాని కూటమి ప్రభుత్వం చెర్లోపల్లి నుంచి నీటిని విడుదలకు చిత్తశుద్ధి చూపకుండా కేవలం కాంట్రాక్టర్ల కోసం అటు పుంగనూరు, ఇటు కుప్పం బ్రాంచి కెనాళ్ల లైనింగ్ పనులకు పూనుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



నీళ్ళుండి వినియోగించుకోలేని చెర్లోపల్లి రిజర్వాయర్

క్లుప్తంగా

విద్యుత్ టారిఫ్ పెంపుపై వీడియో సమావేశం



మాక్‌డ్రిల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ టారిఫ్ పెంపుపై ఈనెల 7,8,10 తేదీల్లో ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ తీసుకొనుంది. దీనిపై శుక్రవారం చిత్తూరులోని ఎస్ఈ కార్యాలయంలో ఏపీఈఆర్సీ ఇన్‌చార్జ్ చైర్మన్ రాం సింగ్ విజయవాడ నుంచి మాక్‌డ్రిల్ వీడియో సమావేశం నిర్వహించారు. వీడియో, ఆడియో, నెట్‌వర్క్ ఎలా వస్తుందో పరిశీలించారు. ముందస్తుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు అభ్యంతరాలు తెలుపడానికి పాల్గొంటారన్నారు. ఆ తేదీల్లో వినియోగదారులు సమావేశానికి హాజరయ్యేలా అధికారులు చూడాలన్నారు. వినియోగదారులకు ఇబ్బందులుంటే సమావేశంలో తెలపాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు నుంచి ఈఈలు మునిచంద్ర, సురేష్, ఏఓ ప్రసన్న ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో ఐరాల విద్యార్థికి పసిడి పతకం



రోహిత్‌ను అభినందిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్ : టెన్త్ కేడెట్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఐరాల విద్యార్థి రోహిత్‌కు బంగారు పతకం దక్కిందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థికి శుక్రవారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖేలో ఇండియా పథకంలో భాగంగా ఫెన్సింగ్ కోచ్ రాఘవ కార్తిక్ వద్ద రోహిత్ ఏడాది పాటు శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ క్రమంలో గత ఏడాది డిసెంబర్ 27, 28 తేదీల్లో కాకినాడలో నిర్వహించిన టెన్త్ కేడెట్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొని బంగారు పథకం సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ రాఘవ కార్తీక్, కోశాధికారి శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద నిర్మించిన శ్రీకాళహస్తి ఫెర్రో అల్లాయ్ కంపెనీ, ఫ్యాక్టరీ ఆవరణలోని స్విమ్మింగ్ పూల్





పనులు ప్రారంభిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి(ఫైల్)



పరిశ్రమకు తొలిఅడుగు

పడమటి నియోజకవర్గం అభివృద్ధికి దూరం.. అయితే పరిశ్రమల స్థాపనకు పరిస్థితులు అనుకూలం.. ఈ విషయం గుర్తించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయం.. అందుకు అంగీకరించిన నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ఆ దిశగా అడుగులు వేయడానికి పెద్దిరెడ్డి.. మిథున్‌రెడ్డిల చేసిన పరి'శ్రమ'కు తొలి అడుగు పడింది. దీనిపై స్థానిక జనం ఆనందం. పుంగనూరు నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటులో భాగంగా స్థాపించిన ఫెరా అల్లాయ్ కంపెనీ ఉత్పత్తులను ప్రారంభించింది.

- నాటి సీఎం జగన్ ఆలోచనతో కారిడార్
- పెద్దిరెడ్డి , మిథున్‌ల కృషి ఫలితం
- నిరుద్యోగులకు వరం

పుంగనూరు: నాలుగు దశాబ్దాలు అభివృద్ధికి నోచుకోని పడమటి నియోజకవర్గమైన పుంగనూరులో తొలిసారిగా పరిశ్రమ ఏర్పాటు చేసి, ఉత్పత్తులను లాంఛనంగా ప్రారంభించడంలో తొలి అడుగు పడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలతో ఈ ప్రాంతం పారిశ్రామిక కారిడార్‌గా రూపుదిద్దుకోనుంది.



ఫెర్రో అల్లాయ్ కంపెనీ ఉత్పత్తులు

మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి కృషితో మండలంలోని ఆరడిగుంట వద్ద ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ పైపుల ఫ్యాక్టరీ నిర్మాణం ఏడాదిలో చకచక సాగిపోయింది.

పరిశ్రమలకు అనుకూలం

పుంగనూరు నియోజకవర్గం కర్ణాటక సరిహద్దుల్లో ఉంది. అలాగే ఎక్స్‌ప్రెస్ హైవేతో పాటు విమానాశ్రయం, రైలు మార్గాలు అందుబాటులో ఉండడంతో పుంగనూరు నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఏర్పాటు చేసేందుకు మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు 2023 సంవత్సరంలో నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సుమారు పదివేల ఎకరాల్లో పరిశ్రమల కారిడార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో శ్రీకాళహస్తి ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఫేరా అల్లాయ్ పైపుల ఫ్యాక్టరీ పనులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. దీంతో 2023 సంవత్సరం మార్చి 24వ తేదీన ఫ్యాక్టరీ పనులకు భూమి పూజ చేసి, నిర్మాణ పనులు చేపట్టారు. అదే సంవత్సరం డిసెంబర్ ఒకటో తేదీ జర్మన్‌కు చెందిన షెఫ్లర్ మోషన్ ఎలక్ట్రికల్ ట్రక్కులు, బస్సులు కంపెనీ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. కానీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో రావడంతో ఆ పనులకు బ్రేక్ పడ్డాయి.

ఫ్యాక్టరీ నిర్మాణం

మండలంలోని ఆరడిగుంట వద్ద 56 ఎకరాల స్థలాన్ని శ్రీకాళహస్తి ఫెర్రో అల్లాయ్ కంపెనీ వారికి నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు మార్చి 24న భూమిపూజతో పనులను మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, కంపెనీ యాజమాన్యంతో కలసి ప్రారంభించారు. ఏడాదిలోనే సుమారు రూ.250 కోట్లతో పరిశ్రమ నిర్మాణం పూర్తి చేసి, ఉత్పత్తుల తయారీని ప్రారంభించారు. కంపెనీలో రోడ్లు, స్విమ్మింగ్‌పుల్ ఏర్పాటు చేశారు. 10 అడుగుల ప్రహారీని నిర్మించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో ఆరడిగుంట పట్టణంగా మారిపోయింది. ఇందులో ప్రత్యక్షంగా , పరోక్షంగా 1500 మంది నిరుద్యోగులకు వివిధ రంగాల్లో ఉపాధి లభించనుంది.

ఉత్పత్తులు..

ఆరడిగుంట వద్ద నిర్మించిన ఫ్యాక్టరీలో ప్రస్తుతం డీఐ పైపులు తయారు చేస్తున్నారు. అలాగే వ్యవసాయంతో పాటు కుటుంబ అవసరాలకు అవసరమైన రబ్బర్, స్టీలు పైపులు తయారు చేయనున్నారు. రెండు నెలల్లో ఫ్యాక్టరీలో అన్ని రకాల పైపులు, స్టీలు ఉత్పత్తులు చేపట్టేందుకు యాజమాన్యం సర్వం సిద్ధం చేస్తోంది.

ముడిసరుకు పుష్కలం

పుంగనూరు నియోజకవర్గంలో పరిశ్రమలకు కావాల్సిన మేరకు విద్యుత్, నీరు, ముడిసరుకు కావాల్సినంత పుష్కలంగా లభిస్తుండడంతో ఈ ప్రాంతం పరిశ్రమలకు అనుకూలమైనదిగా నాటి ప్రభుత్వం గుర్తించింది. అలాగే కంపెనీకి అవసరమైన 133 కేవీ సబ్‌స్టేషన్ కూడ ప్రభుత్వం ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసి, విద్యుత్ సమస్య పరిష్కరించింది.

టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 7వ తేదీ నుంచి 30 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై పూర్తి ఉచితంగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పీ.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల మహిళలు అర్హులన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు ఇస్తామని తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 63017 17672లో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

కార్వేటినగరం: విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కత్తెరపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు .. కత్తెరపల్లి గ్రామానికి చెందిన జ్యోతిప్రకాష్, మీన దంపతుల కుమారుడు హేమంత్‌కుమార్(13) అదే గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో భాగంగా విద్యార్థి మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వచ్చాడు. అయితే ఆ విద్యార్థి తల్లి టైలరింగ్ పనిలో నిమగ్నమై భోజనం పెట్టుకుని తిను అని చెప్పినట్లు సమాచారం. దీంతో ఇంటి లోపలకి వెళ్లిన విద్యార్థి పాఠశాలకు వెళ్లే సమయం గడుస్తున్నా బయటకు రాకపోవడంతో ఇంట్లోకి వెళ్లి చూసిన తల్లికి కుమారుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించడంతో తల్లడిల్లిపోయింది. ఆమె బోరున విలపించడంతో సమీపంలోని వారు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థి మృత దేహాన్ని కిందకి దించారు. విద్యార్థి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

బైక్ దొంగల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

వి.కోట: మండలంలో పలు మోటారుసైకిళ్ల చోరీకి పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యులను శుక్రవారం వి.కోట పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పలమనేరు డీఎస్పీ సుధాకర్ ఈ వివరాలను వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాతం తాలూకా పేర్నంబట్టుకు చెందిన ఖాదర్‌బాషాకు కుమారుడు వశీమ్ (25), అదే పట్టణానికి చెందిన సుందరేషన్ కుమారుడు ప్రేమ్‌కుమార్(26) కలిసి ఇటీవల వి.కోటలో ఉంటూ పట్టణంతోపాటు మండలలోని పలు గ్రామాల్లో మోటారు సైకిళ్లను చోరీ, వాటిని దాచిపెట్టారు. పలువురి ఫిర్యాదు మేరకు సీఐ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో శుక్రవారం వి.కోట-పేర్నంబట్టు జాతీయ రహదారిలోని దుర్గమ్మ ఆలయం వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. వశీమ్ ద్విచక్రవాహనంపై పేర్నంబట్టు నుంచి వి.కోటకు వస్తూ పోలీసులను చూసి, తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా వి.కోటలో 10 మోటారుసైకిళ్ల చోరీ చేసినట్లు అంగీకరించాడు. దీంతో వశీమ్ తోపాటు ప్రేమ్‌కుమార్ పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న సుమారు రూ.5 లక్షలు విలువైన 10 మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన వి.కోట సీఐ సోమశేఖర్ రెడ్డి, ఎస్ఐ బాబు, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కడప జోన్-4 పరిధిలో ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి తెలిపారు. మొత్తం 15 ఖాళీలుండగా.. శనివారం నుంచి దరఖాస్తుల స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు. ఈనెల 17వ తేదీతో దరఖాస్తు స్వీకరణ గడువు ముగుస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇతర వివరాలకు www.cfw.ap.gov.in ను చూడాలని ఆమె పేర్కొన్నారు.

'విశ్వం'లో ఉచిత అవగాహన సదస్సు రేపు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో ఆదివారం ఉదయం 10గంటలకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సదస్సులో పాల్గొనవచ్చని తెలిపారు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష వివరాలు, దరఖాస్తు చేసుకునే విధానం.. తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించనున్నట్టు తెలియజేశారు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు ఈ నెల 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

– డీవీఈవో సయ్యద్ మౌలా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ నెల 4వ తేదీ నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నామని ఇంటర్మీడియెట్ డీవీఈఓ సయ్యద్ మౌలా శుక్రవారం విలేకరులకు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పథకం అమలవుతుందన్నారు. ఈ కళాశాలల్లో మొదటి సంవత్సరం 4091, ద్వితీయ సంవత్సరం 3998 మొత్తం 7989 మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనున్నట్లు చెప్పారు. మొదటి రోజు ప్రారంభ కార్యక్రమంలో విద్యార్థులకు అన్నం, సాంబర్, వెజిటబుల్ కర్రీ, స్వీట్ పొంగల్, రాగి జావా అందజేయనున్నట్లు వెల్లడించారు. దీనిని విజయవంతం చేసేందుకు తగిన ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



సయ్యద్ మౌలా

ఘనంగా శక్తిఅమ్మ పుట్టినరోజు వేడుకలు

వేలూరు: మనిషిగా పుట్టడమే పూర్వ జన్మ పుణ్యమని పీఠాధిపతి శక్తిఅమ్మ అన్నారు. వేలూరు బంగారుగుడి, శ్రీనారాయణి పీఠం పీఠాధిపతి శక్తిఅమ్మ 49వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్ర రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు హాజరై శక్తిఅమ్మకు పుష్పాభిషేకం చేశారు. శక్తిఅమ్మ 49వ జన్మదినోత్సవం శుక్రవారం ఉదయం ఘనంగా జరిగింది. పూజాకార్యక్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు శక్తి అమ్మకు పాదాభివందనం చేసి ఆశీస్సులు అందుకున్నారు.



శక్తి అమ్మ ఆశీస్సులు అందుకుంటున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు


కర్ణాటక మద్యం కేసులో వ్యక్తి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పుంగనూరు: కర్ణాటక నుంచి అక్రమంగా పుంగనూరుకు మద్యం తీసుకొస్తున్న సయ్యద్ అష్రఫ్ అలీని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 180 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పోలీసులు పత్రపల్లి బస్టాప్ వద్ద నిఘా చేపట్టారన్నారు. ఆ సమయంలో పట్టణానికి చెందిన సయ్యద్ అష్రఫ్ అలీ అటు వైపు వచ్చాడు. అనుమానంతో అడిని తనిఖీ చేయగా అతడి వద్ద కర్ణాటక మద్యం ఉండడంతో అతడిని అరెస్టు చేసిన్టు సీఐ తెలిపారు. అతడి వద్ద ఉన్న మద్యంతోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈదాడుల్లో ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది సుబ్రమణ్యంగౌడు, ఢిల్లీబాబు, నాగరాజు, నరేంద్రరెడ్డి, సురేంద్రబాబు, ప్రతాప్ , దశరథ, కిషోర్ పాల్గొన్నారు.

చిరుత దాడిలో మేక మృతి



బంగారుపాళెం: మేకలమందపై చిరుతదాడి చేసి, ఓ మేకను చంపిన సంఘటన శుక్రవారం మండలంలోని మొగిలి కౌండిన్య అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు.. మొగిలి గౌనిచెరువు వద్ద యానాదులు నివాసముంటున్నారు. యానాది చిన్నబ్బ తన మేకలను మేత కోసం గౌనిచెరువు సమీపంలోని కౌండిన్య అడవిలోకి తీసుకు వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో మేకల మందపై చిరుత దాడి చేసి ఓ మేక గొంతు కొరికి చంపివేసింది. ఈ విషయాన్ని గుర్తించిన మేకల, పశువుల కాపరులు కేకలు పెట్టడంతో చిరుత అడవిలోకి పారిపోయిందన్నారు.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య



ప్రభావతి మృతదేహం

పలమనేరు: పట్టణంలోని కాకాతోపునకు చెందిన ఓ వివాహిత బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగుచూసింది.ఇందుకు సంబదించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కాకాతోపునకు చెందిన శ్రీకాంత్‌కు బైరెడ్డిపల్లి మండలం ఎం.కొత్తూరుకు చెందిన ప్రభావతితో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగపిల్లలున్నారు. భర్త కొన్నాళ్లుగా భార్యను పట్టించుకోకుండా బయట ఉన్నట్టు మృతురాలి బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఇంటి నుంచి వెళ్లిన ప్రభావతి పట్టణ సమీపంలోని వారు కౌలుకు తీసుకున్న పొలం వద్ద బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని ఆమె అత్తమామలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రికి పీఎం కోసం తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఇలా ఉండగా తమ బిడ్డ చావునకు భర్త, వారి కుటుంబసభ్యులే కారణమని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న అరవింద్‌కుమార్ (20) అలియాస్ అప్పు అనే వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గతనెల 26వ తేదీన చిత్తూరు నగరంలోని జింకల పార్కు సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఈ ఘటనలో పోలీసుల నుంచి తప్పించుకున్న అప్పు అనే నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు. ఇతడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండుకు ఆదేశించారు.

అది ప్రభుత్వ భూమి..!

సాక్షి టాస్క్‌ఫోర్స్: బండపల్లెలోని వివాదాస్పద భూములు ప్రభుత్వానికి చెందినవని అధికారులు తేల్చారు. చిత్తూరు నగరం బండపల్లి రెవెన్యూలోని 194 వెంకటాపురంలో 24 ఎకరాల భూమిలో కూటమి నేతలు చదును చేసి మామిడి మొక్కలు నాటారు. దీనిపై సాక్షిదినపత్రికలో వార్తా కథనాలు ప్రచురితమయ్యాయి. గ్రామస్తులు సైతం మేత భూమిని ఆక్రమించి మొక్కలు నాటుతున్నారని కలెక్టర్ ఫిర్యాదు చేశారు. దీంతో వారం రోజుల పాటు అధికారులు విచారణ చేపట్టారు. తొలుత అక్రమంగా నాటిన మామిడి మొక్కలను సిబ్బంది ద్వారా తొలగించారు. ఆ తర్వాత విచారణ ప్రక్రియను పూర్తి చేశారు. ఆక్రమణలరె తొలగిస్తూ ప్రభుత్వ భూమిగా గుర్తించి కలెక్టర్‌కు నివేదికలు సమర్పించామని రూరల్ తహసీల్దార్ లోకేశ్వరి వెల్లడించారు.

నాసిరకంగా మధ్యాహ్న భోజనం

పుత్తూరు: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం నాసిరకంగా ఉండడంతో కొంత మంది విద్యార్థులు భోజనం చేయడం లేదని స్కూల్ కమిటీ చైర్మన్లు రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు డాక్టర్ పెంచలయ్య దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పెంచలయ్య భోజనం సరఫరా చేస్తున్న ఇస్కాన్ సభ్యులను ప్రశ్నించారు. భోజనం బాగానే ఉందని, ఇకపై మరింత నాణ్యతతో అందిస్తామని వారు సమాధానం ఇచ్చారు. ఈ సంఘటన శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ శిక్షణ కార్యక్రమంలో చోటు చేసుకొంది. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా యాజమాన్య కమిటీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాఠశాల కమిటీల సహకారం ఎంతో అవసరమన్నారు. అందులో భాగంగానే స్కూల్ కమిటీ చైర్మన్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓ సురేష్, ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, నోడల్ ఆఫీసర్ ఆనందబాబు, రీసోర్స్ పర్సన్స్ లత, రమేష్, హెచ్ఎంలు, కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



చిరంజీవి మృతదేహం

మృతి చెందిన తమిళనాడు వాసి కార్తిక్.

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలో శుక్రవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. వడమాలపేట మండలం ఎస్వీపురం గుట్టకింద అరుంధతివాడకు చెందిన యాశారపు చిరంజీవులు (47) టీటీడీ అన్నదానం క్యాంటీన్ (తిరుమల)లో పనిచేస్తున్నాడు. రోజు గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై తిరుపతికి వెళ్లి అక్కడ నుంచి తిరుమలకు బస్సులో వెళ్లి డూటీ చేసుకుని వచ్చేవాడు. శుక్రవారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కదిరిమంగలం బైపాస్ సర్కిల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే తమిళనాడులోని పెరంబుదూర్‌కు చెందిన కార్తిక్ (22), గౌతమ్ (20) సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయలుదేరారు. వడమాలపేట మండలం పాదిరేడు సమీపంలో ముందు వెళుతున్న లారీని అధిగమించే ప్రయత్నంలో అదుపు తప్పి అదే లారీ వెనుక చక్రాల కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందగా గౌతమ్ గాయపడ్డాడు. వీరిని టోల్ ప్లాజా వాహనంలో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి



పాడుపడిన బావిలో తేలుతున్న శంకరనారాయణ మృతదేహం

తవణంపల్లె: మండలంలోని కారకాంపల్లె సమీపంలోని పాడుపడిన బావిలో వ్యక్తి మృతి చెందినట్లు హెచ్‌సీ గజేంద్ర తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు నగరం గిరింపేట సిద్ధార్థనగర్ కాలనీకి చెందిన బి. శంకరనారాయణ(54) మతిస్థిమితం లేక గత నెల 22వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం మండలంలోని కారకాంపల్లెలో జయరామనాయుడికు చెందిన పాడుబడిన బావిలో వ్యక్తి చనిపోయినట్లు స్థానికులు గుర్తించారు. శవాన్ని బయటకు తీసి ఆరాతీయగా మృతుని కుమారుడు జగదీష్ వచ్చి తన తండ్రిగా గుర్తించారు. మృతుడు శంకరనారాయణకు 7 నెలల క్రితం బ్రెయిన్‌కు ఆపరేషన్ చేయించినట్లు జగదీష్ తెలిపారు. అప్పటి నుంచి మతిస్థిమితం లేక ఎవరినీ గుర్తు పట్టడంలేదని తెలిపారు. ఈ నెల 22వ తేదీన చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. జగదీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 81 మంది మహిళలకు అర్హత



పరుగు పందెంలో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

చిత్తూరు అర్బన్: కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించిన చిత్తూరులో శుక్రవారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్ష(ఈవెంట్స్)ల్లో 81 మంది మహిళా అభ్యర్థులు అర్హత సాధించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులకు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలను (ఈవెంట్స్)ను ఎస్పీ మణికంత పర్యవేక్షించారు. మొత్తం 495 మంది మహిళా అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 283 మంది హాజరయ్యారు. వీళ్లల్లో 81 మంది తదుపరి రాత పరీక్షలకు అర్హత సాధించారు.